సాక్షి అనకాపల్లి

శనివారం । 11 । మార్చి । 2023



పుష్పయాగోత్సవాలు

ఉపమాకలో వెంకన్నకు, దేవేరులకు పుష్పయాగోత్సవం నిర్వహించారు. అద్దాలమండపంలో పవళింపు సేవ చేశారు. IIలో



జర్మనీ వనిత ఏజెన్సీ పర్యటన

పాడేరు: జర్మనీ పర్యాటకురాలు మార్థానో బుల్లెట్‌పై ఏజెన్సీ చేరుకున్నారు. ఆమె 3 నెలలుగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు.



శారదాపీఠంలో దేవదాయశాఖ మంత్రి

విశాఖ: శారద పీఠాన్ని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సందర్శించారు.

న్యూస్‌రీల్

ఈవారం స్పందన రద్దు

అనకాపల్లి టౌన్: ఈనెల 13వ తేదీ సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు డీఆర్వో వెంకటరమణ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజున పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనున్నందున 'స్పందన' జరగదని, అర్జీదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ రవినాథ్ తిల్‌హరి దంపతులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్‌హరి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

పాయకరావుపేట : మంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో ప్రేమ్ కుమార్ షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు ఎంఈవో కె.ఎస్. గాంధీ తెలిపారు. పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయులు ఎ.తాతారావు, తెలుగు ఉపాధ్యాయురాలు సుందరిలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాల ప్రణాళిక సక్రమంగా రాయకపోవడం గమనించిన డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ వీరికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అదే విధంగా మధ్యాహ్న భోజన పథకం కూడా సక్రమంగా నిర్వహించడం లేదని, బాత్‌రూమ్ దగ్గర వంటకాలు చేస్తున్నారని నిర్వాహకులను హెచ్చరించినట్టు ఎంఈవో తెలిపారు.

'ఓటేసే ప్రైవేట్ ఉద్యోగులకు వెసులుబాటివ్వండి'

అనకాపల్లి టౌన్ : జిల్లాలో వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని ఆయా యాజమాన్యాలను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఓటు కలిగిన పట్టభద్రులకు ఆ రోజు విధుల సమయాన్ని తగ్గించాలని కోరారు.



మాక్ పోలింగ్, కౌంటింగ్: విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం మాక్ పోలింగ్, కౌంటింగ్ నిర్వహించారు. ఓటింగ్ కంపార్ట్‌మెంట్ల తయారీ, బ్యాలెట్ బాక్సుల తరలింపు, బ్యాలెట్ పేపర్ల లెక్కింపు తదితర దృశ్యాలివి..

- నేటి సాయంత్రం 4 గంటలతో ప్రచారం బంద్
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ
- బూత్‌ల వారీగా సామగ్రి పంపిణీ

క్లైమాక్స్‌కు ప్రచారపర్వం
పోలింగ్‌కు సిద్ధం



ఎన్నికల ఏర్పాట్లను సమీక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున, కమిషనర్ శ్రీకాంత్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రం 4 గంటలతో ముగియనుంది. ఇప్పటికే ఆయా పార్టీల మద్దతు అభ్యర్థులతో పాటు స్వతంత్రులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. చివరి రోజు కావడంతో.. మరోసారి అన్ని ప్రాంతాల్లోనూ మద్దతుదారులతో జోరుగా ప్రచారం నిర్వహించేందుకు వ్యూహరచన చేసుకున్నారు. మరోవైపు ఈనెల 13న పోలింగ్‌కు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసింది. సిబ్బందిని పూర్తిస్థాయి సుశిక్షితులను చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

ఈ నెల 13న ఉదయం 8 గంటలకు పోలింగ్ మొదలు కానుంది. సాయంత్రం 4 గంటలలోపు పోలింగ్ స్టేషన్లలోనికి వచ్చిన వారికి మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించనున్నారు. ఎన్నికల కమిషన్ తరఫున సచివాలయ ఉద్యోగుల ద్వారా ఓటరు స్లిప్పులు పంపిణీ సజావుగా నిర్వహిస్తున్నారు. వీరితో పాటు పార్టీల వారీగా తమ మద్దతు అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని అభ్యర్థిస్తూ.. ఓటర్లకు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాలు కూడా జోరుగా జరుగుతున్నాయి. ఆయా జిల్లాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే ఎన్నికల మెటీరియల్ తరలింపు ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఒక అభ్యర్థి తరపున ఒక పోలింగ్ ఏజెంట్‌ను మాత్రమే అనుమతించారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ..

ఈ నెల 13వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జేసీ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోనల్ అధికారులు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వారి వారి జోన్లలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పోలింగ్ సిబ్బంది టీమ్‌లు సకాలంలో పోలింగ్ బూత్‌కు చేరేలా పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లను సమన్వయపర్చాలన్నారు. పోలీసు అధికారులు పోలింగ్ జరిగే సమయంలో బూత్‌ల లోపలికి వెళ్లకూడదని సూచించారు. అవసరమైతే పోలింగ్ అధికారి సూచనల మేరకు మాత్రమే పోలీస్ అధికారులు పోలింగ్ బూత్‌లో స్పందించాలని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై పోలీసు అధికారులతో సమీక్షించినట్లు స్పష్టం చేశారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ తదితర టీమ్‌లను ఏర్పాటుచేసి వారి విధుల గురించి వివరించామన్నారు. ఏజెంట్లు, ఓటర్లు ఓటింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు తీసుకొని రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల జోనల్ అధికార్లు, పోలింగ్ అధికార్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీసీపీ సునీల్ సుమిత్ గరుడ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉల్లంఘించినవారు శిక్షార్హులు

అనకాపల్లి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని శనివారం సాయంత్రంతో నిలిపేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి, 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు ప్రచారాలు, బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారు శిక్షార్హులవుతారని హెచ్చరించారు.



- ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, లెఫ్ట్ చెట్టాపట్టాలు
- ప్రాధాన్యత ఓటుపై కుదిరిన ఒప్పందం
- ఓటమి భయంతో టీడీపీ అడ్డదారులు
- పీడీఎఫ్ అభ్యర్థికి రెండో ఓటు వేసేలా పచ్చ నేతల బహిరంగ ఒప్పందం
- టీడీపీ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు వేసేందుకు పీడీఎఫ్ ఓకే
- జనసేన నేతలకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం

టీడీపీతో 'లెఫ్ట్' డీల్

సాక్షి, విశాఖపట్నం : గడిచిన కొన్నేళ్ల కాలంగా ఏ ఒక్క ఎన్నికలోనూ ఒంటరిగా పోటీ చేసే ధైర్యం టీడీపీ చెయ్యడం లేదు. ఇప్పుడు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే తీరును అవలంబిస్తోంది. ఓవైపు వైఎస్సార్‌సీపీ ప్రచారంలో దూకుడు ప్రదర్శించడంతోపాటు.. విజయం దిశగా పయనిస్తుందనే ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో ఓటమి తప్పదని తెలిసి.. టీడీపీ అడ్డదారులు వెతుక్కుంటోంది. నియమనిబంధనలను, విలువలను తుంగలో తొక్కుతూ ఇతర పార్టీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. లెఫ్ట్‌పార్టీలు కూడా అదేబాటలో పయనించడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ప్రాధాన్యత వరుసకు సంబంధించిన పీడీఎఫ్, టీడీపీ రాజీ బేరాలు కుదర్చుకుంది. ఒకరికొకరు సహకరించుకునే ఒప్పందం బహిర్గతమవ్వడంతో నీతిమాలిన రాజకీయాలను గ్రాడ్యుయేట్స్ విమర్శిస్తున్నారు.

సింగిల్‌గా పోటీ చేసే ధైర్యం లేక..

సర్పంచ్ ఎన్నికల నుంచి సార్వత్రిక ఎన్నికల వరకూ ఎక్కడా సింగిల్‌గా సైకిల్ వెళ్లిన దాఖలాలు కనిపించడంలేదు. ఎన్నికలు ఏదైనా ఓటమి చవిచూస్తున్న టీడీపీకి ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమి భయం పట్టుకుంది. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి ప్రతి ఓటరు గడపకు వెళ్లి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే అంతర్గత సర్వేలో ఓటమి తప్పదని తెలుగుదేశం పార్టీకి అవగతమైంది. ఈ నేపథ్యంలో ఏ చిన్న అవకాశం దొరికినా విలువల్ని మరిచి మరీ గెలుపు మాట పక్కన పెట్టి.. తన ప్రత్యర్థి విజయం సాధించకూడదన్న లక్ష్యంతో దొడ్డిదారులు అన్వేషించుకుంటోంది. ఇటీవలే ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్లను ప్రలోభపెట్టేందుకు టీడీపీ మద్దతు అభ్యర్థికి చెందిన లక్షలాది రూపాయలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న విషయం విదితమే. డబ్బులు కుమ్మరించి ఓటర్లను గాలమేసేందుకు ఓవైపు ప్రయత్నాలు చేస్తూనే మరోవైపు వామపక్షాలతో లోపాయికారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సార్వత్రిక ఎన్నికల మాదిరిగా కాకుండా ప్రాధాన్యత సంఖ్యలతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపోటములు మారే అవకాశాలున్నాయి. అందుకే ఆ దిశగా టీడీపీ, వామపక్షాలు మిలాఖత్ అయ్యాయి. రెండు రోజుల క్రితం విజయవాడలో టీడీపీ, వామపక్షాలకు చెందిన కీలక నేతలు సమావేశమై ఇరు పార్టీలు ఒకరికొకరు సహకరించుకునేందుకు పరస్పర అంగీకరించుకున్నారు. తమ పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతివ్వాల్సిందిగా టీడీపీని లెఫ్ట్ పార్టీలు కోరాయి. రెండో ప్రాధాన్యత ఓటును పీడీఎఫ్ అభ్యర్థికి వేసేందుకు టీడీపీ నేతలు అంగీకరించారు. అదేసమయంలో.. తమ రెండో ప్రాధాన్యత ఓటుని టీడీపీ మద్దతు అభ్యర్థికి వేసేందుకు వామపక్షాలు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల ఫలితాల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో స్పష్టత రాకపోతే రెండో ప్రాధాన్యత ఓటు ద్వారా కూడా విజయం సాధించవచ్చనే వ్యూహంతో టీడీపీ వామపక్షాలతో చెట్టపట్టాలేసుకుంది. ఈ విషయమై ఇప్పటికే.. తమ ఓటర్లకు టీడీపీ, వామపక్షాలు సమాచారం అందించి.. రెండో ఓటుపై క్లియర్‌గా చెబుతుండటం విశేషం. కాస్తో కూస్తో విలువలు పాటించే వామపక్షాలు కూడా టీడీపీ మాదిరిగా వ్యవహరించడాన్ని రాజకీయ వర్గాలు చీదరించుకుంటున్నాయి. టీడీపీ, వామపక్షాల ఒప్పందంపై ఓటర్లుగా ఉన్న పట్టభద్రులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు మార్గాలను అనుసరించి.. రాజకీయాలను భ్రష్టు పట్టించేందుకు చేస్తున్న వ్యవహారాలపై విమర్శలు చేస్తున్నారు. లెఫ్ట్ పార్టీలు కూడా ఈ ఒప్పందానికి ఓకే చెప్పడం.. వారి దిగజారుడుతనానికి నిదర్శనమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఆడలేక.. అదిగో వెండి అంటూ..

ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా.. విజయావకాశాలు సన్నగిల్లుతుండటంతో టీడీపీ నేతలకు ఏం చెయ్యాలో తెలీక వైఎస్సార్‌సీపీపై బురద జల్లే ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ క్యాంపు కార్యాలయంలో వేల సంఖ్యలో వెండి బహుమతులు ఉన్నాయంటూ కొందరు టీడీపీ కార్యకర్తలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డా.మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మహరాణిపేట తహసీల్దార్ ఆనంద్ కుమార్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి బృందం బీచ్ రోడ్డులో ఉన్న సుధాకర్ క్యాంపు కార్యాలయం సమీపంలోని ఫ్లాట్‌లో, మెజిస్టిక్స్ టవర్స్‌లోని 101, 105 ఫ్లాట్లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓటరు స్లిప్పులు, కరపత్రాలు మాత్రమే లభించాయి. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎలాంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించడం లేదని అధికారులు రూఢి చేసుకొని రిటర్నింగ్ అధికారికి నివేదికను పంపించారు.

'బైజూస్'పై నిర్లక్ష్యం వద్దు



బైజూస్ వినియోగించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి



విద్యార్థుల అభ్యసన పరిణతిని పరిశీలిస్తున్న ఆర్జేడీ

- యాప్‌ను సక్రమంగా వినియోగిస్తే విద్యార్థులకు మేలు
- అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- గోవాడ హైస్కూల్లో నిర్వహణలోపంపై ఆర్జేడీ ఆగ్రహం

చోడవరం రూరల్/చీడికాడ: విద్యార్థుల విజ్ఞానాన్ని మరింత పెంచేందుకు ఉపకరించే బైజూస్ యాప్ వినియోగం పట్ల నిర్లక్ష్యం వహించరాదని, విద్యార్థులు యాప్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు ఆర్.జ్యోతికుమారి సూచించారు. శుక్రవారం ఆర్జేడీ మండలంలోని గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల విద్యాశాఖ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఉన్నత పాఠశాలలో ఆమె జరిపిన తనిఖీలో 8వ తరగతి విద్యార్థుల ఉపయోగార్థం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందచేసిన ట్యాబ్‌లలో బైజూస్ యాప్ వినియోగించడం లేదన్న సంగతి బయటపడింది. దీంతో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బైజూస్ యాప్ ఉపయోగాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. ఈ విషయంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు రాసిన నోట్ పుస్తకాలను పరిశీలించిన ఆర్జేడీ జ్యోతికుమారి నోట్సులో సరిగా కరెక్షన్లు లేకపోవడం గుర్తించి, ఉపాధ్యాయుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తమ లోపాలను సరిదిద్దుకోవాలని, దీనిపై మండల విద్యాధికారి అధ్యక్షతన త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేస్తామని, కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు. టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ అమలు తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం చోడవరంలోని మండల విద్యాధికారి కార్యాలయాన్ని పరిశీలించి, రికార్డుల నిర్వహణ బాగుందని మండల కార్యాలయ సిబ్బందిని అభినందించారు. ఆర్జేడీ వెంట మండల విద్యాధికారి బి.శ్రీనివాసరావు, సీఆర్పీ కె.వి.ఎం.నాయుడు ఉన్నారు.

ఆర్జేడీ చీడికాడ జెడ్పీ హైస్కూల్, జి.కొత్తపల్లి కె.జి.బి.వి.పాఠశాలలను సందర్శించారు. బైజూస్ కంటెంట్ గురించి ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత గురించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంఈవో గంగరాజు తదితరులున్నారు.

సీతంరాజుకే మా మద్దతు : ఏపీ టీచర్స్ యూనియన్

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.దేముడు, జి.దత్తాత్రేయశర్మ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, నిరుద్యోగ సమస్యలను ఎమ్మెల్సీగా గెలిస్తే సీతంరాజు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ఈ విషయాన్ని గుర్తించి ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

త్వరితగతిన భూముల రీ సర్వే

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



చోడవరం మండలం చాకిపల్లిలో భూముల రీసర్వేపై అధికారులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

చోడవరం: భూముల రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి ఆదేశించారు. మండలంలో చాకిపల్లి గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, భూముల రీసర్వేపై ఆరా తీశారు. రైతులంతా దగ్గర ఉండి తమ భూములను సర్వే చేయించుకోవాలని, లోపాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. అనంతరం చాకిపల్లిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని పరిశీలించారు. జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. లబ్ధిదారులు వేగంగా ఇళ్లను నిర్మించుకోవాల న్నారు. కొందరు అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని, వారికి కూడా స్థలాలను మంజూరు చేయాలని సర్పంచ్ పోతల జానకీప్రసాద్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై పరిశీలించాలని తహసీల్దార్ తిరుమలరావును కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యం క్షీణించడంతో అసహనం వ్యక్తంచేశారు. వెంటనే మెరుగుపరచాలని ఆదేశించారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వద్దు

చీడికాడ: భూ సర్వే విషయంలో నిర్లక్ష్యంవహిస్తే సహించేది లేదని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి హెచ్చరించారు. శుక్రవారం ఆయన చీడికాడ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. సర్వే వేగవంతం చేయాలని, రైతుల నుంచి వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం దండి సురవరం సచివాలయాన్ని సందర్శించారు. భూ సర్వే జరుగుతున్న తీరును అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులంతా కలిసికట్టుగా ఉంటూ దగ్గరుండి సర్వే జరిపించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ బి.వి.రాణి,ఎంపీడీవో జయప్రకాష్ తదితరులున్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ కరాటే పోటీలకు శివ ఎంపిక



మునగపాక: మండలంలోని నారాయుడుపాలెం గ్రామానికి చెందిన కరాటే క్రీడాకారుడు శివ అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖకు చెందిన శ్యాన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థి కాకర శివ మొదటి నుంచి కరాటేలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నాడు. గత నెల 9 నుంచి 12 తేదీ వరకు విశాఖ స్వర్ణభారతి స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో సీనియర్ బ్లాక్ బెల్ట్ 85 కిలోల విభాగం, కుమిటీ (ఫైట్)విభాగాల్లో రెండు బంగారు పతకం సాధించాడు. గతంలో బంగ్లాదేశ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో కూడా బంగారుపతకం సాధించాడు. మే నెలలో 19 నుంచి 23వరకు మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు శివ ఎంపికయ్యాడు. గ్రామస్తులు శివను అభినందించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో దేవరాపల్లి విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి మహిళల ఫుట్‌బాల్ పోటీల్లో దేవరాపల్లి మండలానికి చెందిన మూనురు యశోధర, సీహెచ్. ప్రియాంక ప్రతిభ కనబరిచారు. యశోధర పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, సీహెచ్. ప్రియాంక ఏయూలో డిగ్రీ చదువుతున్నారు. విశాఖపట్నం రైల్వే గ్రౌండ్‌లో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జట్టు తరఫున ఆడి తమ సత్తా చూపారు. విశాఖపట్నం ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నాకౌట్ టోర్నమెంట్‌లో విశాఖజట్టు నాల్గవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా వీరికి మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను నిర్వాహకులు శుక్రవారం అందజేశారు. జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించిన మూనూరు యశోధరను, సీహెచ్. ప్రియాంక, కోచ్ విజయ్‌ను పెదనందిపల్లి హైస్కూల్ హెచ్ఎం పి.శ్రీనివాసరావు అభినందించారు.

గాలికుంటు నివారణే లక్ష్యంగా...

- జిల్లాలో 3 లక్షలకుపైగా జీవాలకు టీకాలు వేయడం ధ్యేయం
- 445 ఆర్బీకే కేంద్రాల్లో పశువైద్య శిబిరాలు
- ఈ నెల 31 వరకు కార్యక్రమం



వ్యాధి వల్ల కలిగే నష్టాన్ని రైతులకు వివరిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి



కె.కోటపాడులో పశువులకు గాలికుంటు టీకాలను వేస్తున్న పశువైద్య సిబ్బంది

కె.కోటపాడు: పశువులకు సోకే పలు వ్యాధులపై పాడి రైతులకు అవగాహన లేకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రధానంగా గాలికుంటు వ్యాధి సోకిన గేదెలు, ఆవుల్లో పాల ఉత్పత్తి తగ్గడం, ఎద్దులు వ్యవసాయ పనులు చేయలేకపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోవడంతో పశుసంఖ్య పెరుగుదల లోపిస్తోంది. ఈ నేపథ్యంలో వ్యాధి నుంచి జీవాలను రక్షించేందుకు పశువైద్య సిబ్బంది ముందస్తుగా టీకాలు వేస్తున్నారు. ఈ నెలాఖరు వరకూ ఈ కార్యక్రమం కొనసాగనుంది.

అనకాపల్లి జిల్లాలో 1.48 లక్షల తెలుపు జాతి పశువులకు, 2 లక్షల 390 నలుపు జాతి పశువులకు గాలికుంటు టీకాలను వేయడమే లక్ష్యంగా సిబ్బంది పెట్టుకున్నారు. జిల్లాలో 445 రైతు భరోసా కేంద్రాల పరిధి గ్రామాల్లో పశువైద్యాధికారులు, 195 మంది పశువైద్య సహాయకులు, 138 మంది గోపాలమిత్రలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలను ఉచితంగా వేస్తున్నారు. ఏటా మార్చి, జూలై నెలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి ఒక అంటువ్యాధి, ఇది పికార్నో వైరస్ వల్ల సోకుతుందనీ, ఈ వ్యాధి సోకడం వల్ల పశువులలో ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి శక్తి సామర్థ్యాలు కుంటుపడతాయి. ఈ వ్యాధిని దేశవాళీ పశువులు తట్టుకుంటాయి. కానీ సంకరజాతి పశువుల్లో మాత్రం వ్యాధి తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఈ వ్యాధి లక్షణాలు పశువుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. పశువుల శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారెన్ హీట్ నుంచి 106 వరకు పెరిగి పశువులు నీరసించిపోతాయి. నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి, ఆహారం, నీరు తీసుకోలేక బాగా నీరసించి నడవలేని స్థితికి వస్తాయి. ఎద్దులు వ్యవసాయ పనులు చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. పాలిచ్చే పశువులకు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. వ్యాధి సోకిన ఆవుల, గేదెల పాలు తాగిన దూడలు మరణించే అవకాశాలు కూడా ఉంటాయి.

గాలికుంటు టీకాల వల్ల ప్రయోజనాలు :

టీకాలను వేయడం వల్ల గాలికుంటు వ్యాధి సోకిన పశువుల పాల ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఉండదు. వ్యాధి బారిన పడిన మగ పశువుల్లో పని సామర్థ్యం తగ్గే అవకాశాలు ఉండవని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలుపుతున్నారు. టీకాలు వేసిన దూడలు వ్యాధి బారిన పడినా మరణాల లేకుండా ఉండడంతోపాటు ఆరోగ్యంగా ఎదుగుతాయి. ముఖ్యంగా పశువుల పాకలను శుభ్రంగా ఉంచాలి. 3 నెలలు దాటిన దూడలకు, పశువులకు, చూడి పశువులను ఏడాదికి రెండు సార్లు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే ఈ వ్యాధిని నివారించవచ్చు.

గాలికుంటు వ్యాధికి చికిత్స

గాలికుంటు వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరు చేయాలి. వ్యాధి సోకిన పశువుల పుండ్లను పోటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడగాలి. నోటిలో ఏర్పడిన పుండ్లకు బోరోగ్లిసరిన్ పూయాలి. వ్యాధి సోకిన పశువులు ఆహారాన్ని తీసుకోలేవు. కాబట్టి వాటికి అంబలి లాంటి ద్రవాహారం ఇవ్వాలి. సమీప పశువైద్యాన్ని సంప్రదించి చికిత్స అందించాలి.

టీకాలు వేయించాను



రైతుల పశువుల పాకల వద్దకే వచ్చి గాలికుంటు వ్యాధి టీకాలను పశువైద్య సిబ్బంది వేస్తున్నారు. గతంలో గాలికుంటు వ్యాధి సోకితే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ కష్టాలు తొలగాయి.

– చిరికి గోవింద, రైతు, వారాడ

రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు



తెలుపు, నలుపు రంగు జాతి పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశాలు అధికం. ప్రధానంగా గాలిలో ఉండే వైరస్ వల్ల వ్యాధి సోకుతుంది. ఈ నేపథ్యంలో ముందస్తుగా టీకాలను పశువులకు వేసి వాటిలో వ్యాధి నిరోధక శక్తి సామర్థ్యాన్ని పెంచేందుకు నెల రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కార్యక్రమం అమలు తీరును రోజూ పర్యవేక్షిస్తున్నాం.

– బి.ప్రసాదరావు, జిల్లా పశువైద్యాధికారి, అనకాపల్లి

హెచ్3ఎన్2పై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

మహారాణిపేట: దేశంలో కొత్త రకం ఫ్లూ హెచ్3ఎన్2 వైరస్ వ్యాప్తి నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కేజీహెచ్, అంటు రోగుల ప్రభుత్వ ఆస్పత్రి, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పడకలు సిద్ధం చేశారు. సంబంధిత వైద్యులు కూడా అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. జ్వరం, తలనొప్పి, దగ్గు, జలుబుకు అవసరమైన మందులను కూడా సిద్ధంగా ఉంచారు. బాధితులకు పరీక్షలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్లు ఇంటింటి సర్వే కూడా చేపట్టారు.

- జ్వరంతో బాధపడుతూ కేజీహెచ్‌కు వచ్చే రోగులకు జనరల్ ఫిజీషియన్ వైద్యులు సేవలు అందిస్తున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. కొద్ది రోజుల నుంచి ఓపీకి ఎక్కువగా జ్వరం, దగ్గు, తల, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న రోగులు వస్తున్నారన్నారు. దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు ఉన్న వారు జాగ్రత్తలు తీసుకుని, వైద్యులను సంప్రదించాలని సూచించారు.

డోర్ టూ డోర్ సర్వే

జ్వరాల వ్యాప్తిపై వలంటీర్లు డోర్ టూ డోర్ సర్వే చేస్తున్నారు. బాధితుల నుంచి రక్తం శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పంపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సర్వే చురుగ్గా సాగుతోంది.

కాలం చెల్లిన పోలీస్ వాహనాలకు 13న వేలం

అనకాపల్లిటౌన్: జిల్లాలో పోలీసు విభాగానికి చెందిన కాలం చెల్లిన వాహనాలను ఈ నెల 13న ఆన్‌లైన్ ద్వారా వేలం నిర్వహించనున్నట్టు ఎస్పీ గౌతమి సాలి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 89 కాలం చెల్లిన వాహనాలను 15 లాట్లుగా విభజించి ఈ వేలాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు https:// www.konugolu.ap.gov.in అనే వెబ్ సైట్ ద్వారా వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

అరటి తోట దగ్ధం..కౌలు రైతుకు నష్టం



దగ్ధమైన అరటి తోటలో ఒక భాగం

రావికమతం : జెడ్.కొత్తపట్నంలో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కౌలు రైతు లాలం అప్పలనాయుడుకు చెందిన ఎకరన్నర పొలంలో సాగు చేస్తున్న అరటి తోట దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఆయనకు రూ.లక్షకుపైగా ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా. జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన లాలం రాజుబాబు వద్ద రెండెకరాల పొలం కౌలుకు తీసుకున్న అప్పలనాయుడు అరటి సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం చిన్న చిన్న గెలలు వేసి త్వరలో ఫలసాయం అందుబాటులోకి వస్తుందన్న తరుణంలో దారిన పోయేవారెవరో కాల్చిపారేసిన సిగరెట్ విసిరేయడంతో అగ్నిప్రమాదం సంభవించి అరటి తోట కాలిపోయింది. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి, త్వరలో ఫలసాయం వస్తుంది, అప్పులు తీర్చేద్దామనుకున్న తరుణంలో ప్రమాదం జరగడం, అరటి గెలలు మాగిపోవడంతో అప్పలనాయుడు తీవ్రంగా నష్ట పోయాడు. కన్నీరు మున్నీరయ్యాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఉపమాకలో ముగిసిన పుష్పయాగోత్సవాలు



అద్దాల మండపంలో స్వామి వారి పవళింపు సేవ



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాకలో వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా మూడురోజుల పాటు నిర్వహించిన స్వామివారి పుష్పయాగోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. నెల 2వ తేదీనుంచి 7వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించారు.అనంతరం మూడు రోజుల పాటు పుష్పయాగోత్సవాలు నిర్వహించినట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం మూలవిరాట్ సన్నిధిలో నిత్యాభిషేకాలు, అర్చనలు, బాలభోగనివేదన, రాజభోగనివేదన, నాలాయిర సేవాకాలం, తీర్థగోష్ఠి,ప్రసాద వినియోగం నిర్వహించినట్టు చెప్పారు.అనంతరం కవాట బంధనం, ఆలయ శుద్ధి,అష్టదిక్పాలకులకు బలిహరణ పూర్తి చేశామన్నారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా స్వామివారిని అమ్మవారిని అద్దాలమండపంలో ఉంచి పూలతో అలంకరించి, పవళింపు సేవలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంతో వారం రోజులపాటు కల్యాణోత్సవాలు, మూడు రోజుల పాటు నిర్వహించిన పుష్పయాగోత్సవాలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. పుష్పాలంకరణలో స్వామివారిని దర్శించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు.స్వామివారి ఉత్సవ మూర్తులను భక్తులకు అద్దంలో చూపించారు.ఈకార్యక్రమాల్లో అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి, పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రోడ్డుకు సర్వే

నర్సీపట్నం: పట్టణంలో ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొత్తవీధి శ్మశాన వాటిక మీదుగా పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోడవరం వెళ్లే ప్రధాన రోడ్డుకు అనుసంధానించనున్నారు. 2.5 కిలోమీటర్ల రోడ్డును 40 అడుగుల మేర విస్తరించనున్నారు. ఇందుకోసం టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ సర్వే అధికారులు గురువారం సర్వే పనులు చేపట్టారు.

అన్నింటా మహిళలు ముందంజ

మహిళా వారోత్సవాల్లో ఎంపీ సత్యవతి



మహిళకు ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఎంపీ సత్యవతి



ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులను సత్కరిస్తున్న ఎస్వీడీఎస్ ప్రతినిధులు

అనకాపల్లి రూరల్ : అవకాశాలు అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉంటున్నారని అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. తుమ్మపాల శారదా వ్యాలీ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ మహిళా వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎల్ఈడీపీ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలతో మిల్లెట్స్ తయారీ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది విద్యార్థులు, మహిళలకు ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె తిలకించారు. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం శ్రీనివాసరావు, ఎస్వీడీఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అధికారి కవిత, ఎఫ్‌పీవో చైర్మన్ పడాల గణపతి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మహాలక్ష్మి, ఎస్వీడీఎస్ సలహాదారుడు బాగి మాస్టర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

అదే సంస్థ ఆధ్వర్యంలో ఉదయం జరిగిన అంతర్జాతీయ చిరుధాన్య వారోత్సవాల సమావేశంలో ఎంపీ సత్యవతి మాట్లాడుతూ చిరు ధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగుకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని తెలిపారు. పలువురు శాస్త్రవేత్తలు చిరుధాన్యాల సాగు ఆవశ్యకతను, ఉత్పత్తుల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు నిర్వాహకులు పాల్గొన్నారు.

సిమెంట్ శ్లాబ్ విరిగి పడి ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న చిన్నబ్బాయి

రాజవొమ్మంగి : టాయిలెట్ నిర్మాణ పనుల్లో భాగంగా ఓ వ్యక్తిపై ఎత్తు నుంచి సిమ్మెంట్ శ్లాబ్ విరిగి పడడంతో తీవ్ర గాయాల పాలైన సంఘటన మండలంలోని కిమ్మిలిగెడ్డలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన ఇంటి యజమాని కంకిపాటి చిన్నబ్బాయి తలపై గోడ కూలిపోగా నుదురు, ముక్కు తదితర శరీరభాగాలకు గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో ఉన్న అతనిని కుటుంబీకులు వెంటనే 108 సహాయంతో రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించగా డాక్టర్ లిఖిత ప్రథమ చికిత్స చేసి నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఇంటర్నల్ బ్లీడింగ్ అయ్యిందని, స్కానింగ్ చేసి తక్షణ వైద్యం అందించాల్సి ఉంటుందని డాక్టర్ లిఖిత తెలిపారు.

వలస కూలీ విషాదాంతం



గంగాసాగర్ మృతదేహం, (ఇన్‌సెట్) గంగాసాగర్ (ఫైల్)

రాజవొమ్మంగి : పొట్ట చేత పట్టుకొని కలప నరికే పనులకు వెళ్లిన రాజవొమ్మంగికి చెందిన గిరిజన యువకుడు కలింకోట గంగాసాగర్ (26) విగతజీవిగా స్వగ్రామం చేరడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకొంది. వలస పనులకు వెళ్లి అనుకోని రీతిలో మరణించిన గంగాసాగర్ మృతదేహం వారం రోజుల తరువాత శుక్రవారం స్వగృహానికి చేరుకోవడంతో రాజవొమ్మంగిలో విషాదం అలముకొంది. వివరాల్లోకి వెళితే కొంత మంది యువకులతో కలసి కలింకోట గంగాసాగర్ (అనిల్) అనే యువకుడు 3వ తేదీన గుంటూరుకు సుబాబుల్ కలప చెట్లు నరికే పనికి వెళ్లాడు. అయితే కూలి రేటు నచ్చక జట్టు కూలీల్లో కొంతమంది ఎవరికి వారు ఇంటిముఖం పట్టారు. వారిలో ఒకరైన గంగాసాగర్ చేతిలో సొమ్ములు లేక కొంత మేర నడిచి రాజవొమ్మంగి చేరుకొనే ప్రయత్నం చేశాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వచ్చే సరికి బాగా నీరసించిన గంగాసాగర్ గోదావరి ఒడ్డున సేదతీరాడు. ఆ తరువాత అక్కడే చనిపోయాడు. కాగా కొవ్వూరు పోలీసులు 7వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. పత్రికలలో వచ్చిన కథనాలకు గంగాసాగర్ చనిపోయి ఉండవచ్చని భావించిన కుటుంబీకులు, తోటి జట్టు కూలీలు కొవ్వూరు వెళ్లి ఆరా తీశారు. అతనికి తరుచూ ఫిట్స్ వస్తాయని కుటుంబ సభ్యులు తెలిపారు. చనిపోయింది గంగాసాగర్ అని నిర్ధారించుకొన్నారు. దీంతో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్టు పట్టణ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గంగాసాగర్ తండ్రి ఇదివరకే చనిపోగా కుటుంబాన్ని పోషించుకొనేందుకు వలస వెళ్లిన ఒక్కగానొక్క కుమారుడు గంగాప్రసాద్ ఈ విధంగా మృతి చెందడంతో తల్లి కళ్యాణి దుఃఖానికి అంతులేకుండా పోయింది. కళ్యాణి స్థానికంగా ఓ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తోంది. చేతికి అందివచ్చిన కొడుకు ఇలా ఒంటరిని చేసి వెళ్లిపోవడంతో కళ్యాణి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

వర్క్ ఫ్రం హోమ్‌తో బహుళ ప్రయోజనాలు

సీతంపేట(విశాఖ ఉత్తర): కోవిడ్ మహమ్మారి కారణంగా అమలులోకి వచ్చిన వర్క్ ఫ్రం హోమ్ విధానం అటు వ్యాపార సంస్థలు, ఇటు ఉద్యోగులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చిందని సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్(సిడార్) చైర్మన్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి తెలిపారు. ఇంటి నుంచి పని, ఉద్యోగుల దృక్పథాలు అనే అంశంపై సంస్థ చేపట్టిన సర్వే నివేదికను శుక్రవారం బుల్లయ్య కళాశాలలో జరిగిన సదస్సులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌కు ముందు వర్క్ ఫ్రం హోమ్ విధానం లేకపోయినప్పటికీ వ్యాపార, సాఫ్ట్‌వేర్ సంస్థలు వాటి మనుడగ కోసం ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయడం తప్పనిసరైందన్నారు. ఈ విధానం వల్ల ఉద్యోగుల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు వారి జీవన విధానంలో మంచి సౌలభ్యం లభించిందన్నారు. ఈ సర్వేలో చాలా ఆసక్తికరమైన విషయాలు తెలిశాయని, వాటన్నింటిని క్రోడీకరించి నివేదిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో సిడార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక.. ఉరుసు వేడుక

- అన్సర్ మద్‌ని ఔలియా చందనోత్సవం నేడు
- తరలిరానున్న ముస్లింలు, హిందువులు



బయ్యవరంలో హజరత్ అన్సర్ మద్‌ని ఔలియా దర్గా

కశింకోట : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బయ్యవరంలోని హజరత్ అన్సర్ మద్‌ని ఔలియా ఉరుసు షరీఫ్(చందనోత్సవం) శనివారం జరగనుంది. ఇందుకు భారీ ఏర్పాట్లు చేసినట్లు దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవానికి జిల్లాతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలు, టాటా నగర్, ఒడిశా వంటి రాష్ట్రేతర ప్రాంతాల నుంచి ముస్లింలతోపాటు స్థానిక హిందువులు కూడా హాజరవుతారు. ఏటా మార్చి నెలలో ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఇస్లాం సేవలో ఔలియా

ఇస్లాం మతానికి ఔలియా విశేష సేవలందించారు. 13వ శతాబ్దంలో మహ్మద్ బీన్ తుగ్లక్ భారత దేశాన్ని పాలించే సమయంలో అన్సర్ మద్‌ని ఔలియా దక్షిణ భారత దేశంలో ధర్మ సంస్థాపనకు కృషి చేశారు. సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం తన గురువైన ఢిల్లీకి చెందిన హజరత్ నిజాముద్దీన్ ఆజ్ఞతో కశింకోటకు వచ్చి బోధనలు సాగించినట్లు చరిత్ర చెబుతుంది. ప్రస్తుత గాడి వీధిలో అప్పట్లో ఆయన పెద్ద పుస్తక భాండాగారాన్ని నెలకొల్పారు. ఆయన బోధనలు నాటి ప్రజల్ని విశేషంగా ఆకట్టుకునేవి. బాధాతప్త హృదయాలకు సాంత్వన కలిగించేవని ప్రతీతి. అన్సర్ మద్‌ని ఔలియా మహిమలు భారత దేశంతో పాటు ఇతర దేశాలకు కూడా వ్యాపించి కోట్లాది భక్తులు, శిష్యులు ఆయన మార్గాన్ని అనుసరించారు. 1393 మే నెలలో అన్సర్ మద్‌ని ఔలియా పరమపదించినట్లు ఆధారాలున్నాయి. ఆయన భౌతిక కాయాన్ని స్థానిక బయ్యవరం గ్రామ సమీపంలోని కొండ వద్ద సమాధి చేశారు. ఆయనపై భక్తి విశ్వాసాలతో శిష్యులు ఏడు శతాబ్దాలుగా ఉరుసు షరీఫ్‌ను నిర్వహిస్తూ భక్తి ప్రపత్తులు చాటుకుంటున్నారు.

హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రతీక

ఉరుసు షరీఫ్‌ను పురస్కరించుకుని పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ముస్లిం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. అన్సర్ మద్‌ని సమాధిని దర్శించి ఛాదర్‌లు కప్పి పూలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేస్తారు. ఖర్జూరం, తీపి బూందీ, గులాబీ పూలు, చందనం, సుగంధ ద్రవ్యాలు వగైరా సమర్పిస్తారు. కొంతమంది రాత్రి ఇక్కడ కుటుంబ సభ్యులతో జాగరణ చేస్తారు. ముస్లింలతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన హిందువులు కూడా ఔలియా దర్గాను దర్శించుకుని, ఉరుసు ఉత్సవంలో పాలు పంచుకుంటారు. హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా ఈ ఉత్సవం నిలుస్తుంది. దర్గా ప్రాంతంలో రాత్రి పెద్ద జాతర జరుగుతుంది. తిను బండారాలు, మహిళల అలంకరణ వస్తువులు, పిల్లల ఆట వస్తువులు జోరుగా విక్రయిస్తారు. ఉరుసు షరీఫ్ పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము నుంచి చందనోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి అంతా కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఔలియా సమాధికి చందనం పూయుట, సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక ప్రార్థన, అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. రాత్రి 'ఖవ్వాలి' ఉర్దూ భక్తి పాటల పోటీని ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మండల ప్రత్యేకాధికారిగా రోజారాణి

కశింకోట : మండల ప్రత్యేక అధికారిగా ఉపాధి హామీ పథకం ఏపీడీ రోజారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పలువురు మండల అధికారులు కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు. ఇంత వరకు వ్యవసాయ శాఖ ఏడీ బి. మోహనరావు ప్రత్యేక అధికారిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలోనే రోజారాణికి బాధ్యతలు అప్పగించారు.

వీధి దీపాల పునరుద్ధరణ



సింగవరంలో వీధిలైట్లను మార్చుతున్న సిబ్బంది

కశింకోట : మండలంలోని జి.భీమవరం శివారు సింగవరం గ్రామంలో షార్టు సర్క్యూట్ వల్ల కాలిపోయిన వీధి లైట్ల స్థానంలో శుక్రవారం కొత్త లైట్లను ఏర్పాటు చేశారు. వారం కిందట లైట్లు కాలిపోయాయి. దీంతో రాత్రిపూట వీధుల్లో చీకట్లు అలముకుని ప్రజలు ఇబ్బంది పడేవారు. సర్పంచ్ హనుమంతు వెంకటలక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు అల్లం శంకరరావులు ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు నివేదించారు. స్పందించిన యంత్రాంగం లైట్లను పునరుద్ధరించింది. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీలతోపాటు పంచాయతీ కార్యదర్శి బర్నికాన చిన్నోడు, ఉప సర్పంచ్ కొంగ్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు కిల్లాడ నగేష్, సత్తిబాబు పనుల్ని పర్యవేక్షించారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో అభివృద్ధి కమిటీ డైరెక్టర్

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైద్యుడు రామ్మూర్తి గురువారం రాత్రి సందర్శించారు. వైద్యసేవలపై డ్యూడీ డాక్టర్, రోగులను ఆరా తీశారు. సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

టీడీపీ ఎమ్మెల్సీ ప్రచారం

కశింకోట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీడీపీ బలపరచిన వేపాడ చిరంజీవిరావును గెలిపించాలంటూ స్థానిక గవరపేటలో ఆ పార్టీ మద్దతుదారులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటును తమ అభ్యర్థికే వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల లోవకృష్ణ, ఆడారి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



కశింకోటలో నులి పురుగుల నివారణ మందులు అందిస్తున్న మండల ప్రత్యేక అధికారి రోజారాణి

కశింకోట : నులి పురుగుల నివారణకు ప్రభుత్వం విద్యార్థులకిచ్చే మాత్రల పంపిణీకి ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రోజారాణి సూచించారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 14న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని సంబంధిత గ్రామాల ఏఎన్‌ఎంలకు మాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని పాఠశాల్లో 2 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు అందజేసి డొసేజ్ మేరకు స్వయంగా మింగించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు తిరుపతిరావు, యు.రమేష్, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రమేష్, జి.అభిషేక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణం



విసన్నపేట లే అవుట్ పరిశీలిస్తున్న రోజారాణి

కశింకోట : వైఎస్సార్ జగనన్న గృహనిర్మాణ లే-అవుట్లలో స్థలాలు పొంది ఇంకా ప్రారంభించని లబ్ధిదారులు సత్వరమే నిర్మాణాలను చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రోజారాణి కోరారు. మండలంలోని విసన్నపేట, జమాదులపాలెం గ్రామాల్లోని వైఎస్సార్ జగనన్న లే అవుట్లను అధికారులతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వచ్చే ఉగాది నాటికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ కె.మధురవాణి, ఏఈ వి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్‌లు ఉప్పునూరి మాణిక్యం, కరక రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా సుధాకర్ గెలుపు ఖాయం'

ఊరూవాడా హోరెత్తిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో మాట్లాడుతున్న మందపాటి జానకిరామరాజు



83వ వార్డులో ప్రచారం చేస్తున్న పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్



గవరపాలెంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలోఉన్న వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరింత ధీమా పెరుగుతుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక న్యాయ సముదాయ ఆవరణలోని బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులైన న్యాయమూర్తులంతా రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. న్యాయ సముదాయం భవన నిర్మాణం, ఇతర సమస్యలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిశాక న్యాయవాదులతో మంత్రి అమర్‌నాథ్ ప్రత్యేక భేటీకి ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు, వైద్యుడు జి.రామ్మూర్తి మాట్లాడుతూ సౌమ్యుడు, మృదుస్వభావి, కార్యదీక్షాపరుడైన సుధాకర్‌ను గెలిపించడానికి న్యాయవాదులంతా సహకరించాలని కోరారు.

- వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో సీహెచ్ అగ్రహారం, మార్టూరు, బవులవాడ, ఊడేరు, దిబ్బపాలెం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల్ని కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కొల్లిమల్ల గోవిందరావు, కరణం రెవెన్యూనాయుడు, ఒమ్మి మధుబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఎంపీటీసీ మిద్దె రాజా రామచంద్రరావు, పార్టీ నేతలు కరణం నాగేశ్వరరావు, కరణం కృష్ణ, కరణం సత్తిబాబు, పసుపులేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలో పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం చేశారు. పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మాజీ కౌన్సిలర్ పలకా సత్యనారాయణలు పట్టభద్రులను ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు గైపూరి రాజు, సతీష్‌రెడ్డి, ఎం.సురేష్, కోన ఉమ, పేలూరి కల్యాణ్, ఈతలపాక శివ, బంగారు చంటి పాల్గొన్నారు.
- వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ కోరారు. 83వవార్డు పరిధిలో శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, తంగెళ్ల బుజ్జి, రెడ్డి చిన్నా, గజ్జి నారాయణ, మంగిన సాయి పాల్గొన్నారు.
- వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యంత మెజార్టీతో గెలిపించాలని గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ ఓటర్లను కోరారు. పట్టణంలోని గవరపాలెం ప్రాంతంలో స్థానిక నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు బుద్ద రామచంద్రరావు, దాడి శ్రీను, దాడి అరుణ, దాడి శ్రీను, కోరిబిల్లి బాబ్జీ పాల్గొన్నారు.
- విలీన గ్రామమైన సిరసపల్లి గ్రామంలో పార్టీ నేత ఈగల మహేష్ ఉద్యోగ, ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.
- సీతంరాజు సుధాకర్ విజయంతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి దంపతులు అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం, యూకో బ్యాంకు, వ్యవసాయశాఖ, ఆడిట్ కార్యాలయం, వ్యవసాయ భూ పరీక్షా కేంద్రాల్లో పట్టభద్రులను వారు ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత కరక సోమినాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు దాడి కుమార్ పాల్గొన్నారు.
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పట్టభద్రులను గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, రమణ, రవి పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ శ్రేణులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిస్తే చేపట్టనున్న కార్యక్రమాలపై రూపొందించిన కర పత్రాన్ని పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ స్థానిక గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రచారంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి దంపతులు



బ్యాంకు ఉద్యోగులను ఓటు అభ్యర్థిస్తున్న గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ



ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



నరసింగబిల్లిలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం

నూకాంబిక ఆలయం ముస్తాబు



నరసింగబిల్లిలో నూకాంబిక ఆలయం

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో కొత్త అమావాస్య ఉత్సవాలకు నూకాంబిక ఆలయం వద్ద సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 20న జాగరణ, 21న కొత్త అమావాస్య జాతర, 22న ఉగాది ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కోన వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి అందంగా రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



పవన్‌కుమార్

పరవాడ : మండలంలోని వెన్నలపాలెం గ్రామానికి చెందిన పెదపాటి పవన్‌కుమార్(32) ఈ నెల 4 తేదీ నుంచి కనిపించడం లేదని అతని తండ్రి పెదపాటి మాణిక్యం శుక్రవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు కొంతకాలంగా మానసిక ఆరోగ్యంతో బాధపడుతున్నాడని పేర్కొన్నాడు. కుమారుడి ఆచూకీ కోసం పరిసర గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసును ఏఎస్‌ఐ వర్మ దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పరవాడ : తానాం సమీపంలోని జీడి మామిడి తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పరవాడ పోలీసులు శుక్రవారం దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ సురేష్ అందించిన వివరాలు... తానాం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారంతో సిబ్బందితో పోలీసులు దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1300 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సురేష్ చెప్పారు.

అనకాపల్లి సినిమాలు

గ్రంథాలయం	రాజా
సీఎస్‌ఐ	సత్యనారాయణస్క్రీన్-1
సాచి	సత్యనారాయణస్క్రీన్-2
వినరోభాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
వాల్తేరు వీరయ్య	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 4,739 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,750	4,000
మొదటి రకం	3,500	3,730
రెండో రకం	3,200	3,530
మూడో రకం	3,050	3,230

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-5 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 492 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 398 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఆరా



ట్యాబ్స్ వినియోగిస్తున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న రమేష్ నాయుడు

సబ్బవరం: మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో రమేష్ నాయుడు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో బోధనకు సంబంధించి అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. 6, 7, 8వ తరగతుల్లో అభ్యసనాభివృద్ధి కార్యక్రమం అమలు, బైజూస్ ట్యాబ్స్ వినియోగిస్తున్న విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు తరల్ కార్యక్రమం ద్వారా బోధిస్తున్న తీరును పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలో రక్తహీనత గల బాలికలను గుర్తించి వారికి పాఠశాల హెల్త్ అంబాసిడర్ల ద్వారా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం దగ్గరుండి విద్యార్థులకు తినిపించాలని, రెగ్యులర్‌గా ఐరెన్ మాత్రలు వారికి వేయించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో ఎస్.అప్పలరాజు, ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీ జగదీష్ తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మూలపేట శ్మశానవాటికలో బోరుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : మూలపేటలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. మూలపేటలో మరమ్మతుకు గురైన బోర్లను శుక్రవారం ఆయన అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు.

ఎన్టీపీసీలో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం



విజేతలతో సంస్థ జీజీఎం సిన్హా

పరవాడ: భద్రత ప్రమాణాల నిర్వహణలో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ భద్రత పార్క్‌లో శుక్రవారం నిర్వహించిన 52వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలో భద్రత, ఆరోగ్యం, పర్యావరణ సమస్యలపై యాజమాన్యం మరింత దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించే విధంగా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించి ప్రమాదాల నివారణపై పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు ఉద్యోగులకు వ్యాసరచన, స్కిట్, సేఫ్టీ అంశాల్లో పోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన విజేతలకు జీజీఎం సిన్హా బహుమతు లు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు భద్రత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఓ అండ్ ఎం జీఎం డి.పి పాత్రో, భద్రత డీజీఎం, సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

13న విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం

మునగపాక : స్థానిక సంతబయల పురాతన విఘ్నేశ్వర దేవస్థానం వార్షికోత్సవాలను ఈ నెల 13న ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ మందపాటి శ్రీరామ వెంకట నరసింగరావుశుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు




గొబ్బూరు వద్ద ఢీకొన్న లారీ, కారు

కశింకోట : మండలంలోని గొబ్బూరు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న ఇన్నోవా కారు, గొబ్బూరు వద్ద మలుపు తిరుగు తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న విజయనగరం జిల్లా చింతలవలస గ్రామానికి చెందిన నూతన దంపతులు సూర్య, ఝాన్సీ, మరో ముగ్గురు కుటుంబ సభ్యులు గాయపడ్డారు. వీరిని 108లో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నూతన దంపతులు చింతలవలస నుంచి అన్నవరం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. ప్రమాదంపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

రాంబిల్లి : నేవీ పునరావాసకాలనీలో శుక్రవారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం



కశింకోటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం కూడలిలో అక్రమంగా రవాణా చేస్తున్న 40 పశువులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో తరలిస్తున్న 35 ఎద్దులు, 5 ఆవులను వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన డ్రైవర్ లంతూరు విశాల్ (28), నిర్వాహకుడు జార్ఖండ్‌కు చెందిన మహ్మద్ సద్దాంలను అరెస్టు చేశామన్నారు. కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.